సాక్షి కాకినాడ

సోమవారం, 18, సెప్టెంబర్, 2023



రూ.80 వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి నిత్యాన్నదానం ట్రస్టుకు సుందరపల్లి వెంకట్రావు, తులసి దంపతులు, కుటుంబ సభ్యులు (కాకినాడ) ఆదివారం రూ.80 వేల విరాళం సమర్పించారు.



లోవ దేవస్థానానికి రూ.లక్ష..

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో మహామండపం నిర్మాణానికి విన్నకోట లక్ష్మీ కరుణలత, కుటుంబ సభ్యులు (విజయనగరం) ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 4,31,844 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,400, పశ్చిమ డెల్టాకు 7 వేల క్యూసెక్కుల నీరు వదిలారు. భద్రాచలం వద్ద 29.40, కాటన్ బ్యారేజీ వద్ద 9.50 అడుగులకు నీటిమట్టం చేరింది.

జైజై గణేశా..

- తొలి పూజలకు సిద్ధమవుతున్న ఉమాపుత్రుడు
- వాడవాడలా నవరాత్ర శోభ
- ఆకట్టుకుంటున్న వినాయక మంటపాలు
- కొనుగోలుదార్లతో మార్కెట్లు కిటకిట
- వివిధ రూపాల్లో ముస్తాబైన గణనాథులు
- రూ.5 వేల నుంచి రూ.1.5 లక్షల వరకూ విగ్రహాల ధరలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జై విఘ్నేశ... శరణు గణేశ అంటూ ఆ స్వామి పూజకు వేళయ్యింది. గణనాథుడిని మనసారా కొలిచే వినాయక చవితి వేడుకను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించుకొనేందుకు ముస్తాబయ్యింది. స్వామివారి నవరాత్ర ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా మంటపాలు ఏర్పాటు చేశారు. అక్కడ నెలకొల్పే గణనాథుని విగ్రహాలను ఆదివారం తీసుకువచ్చారు. నగరంలోని విఘ్నేశ్వర స్వామి ఆలయాలతో పాటు, పలు ప్రాంతాల్లో మంటపాలు ఏర్పాటు చేసి వినాయకుని విగ్రహాలు నెలకొల్పుతున్నారు. సోమవారం నుంచి ఈ నెల 26వ తేదీ వరకూ నవరాత్ర ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక దేవదాయ శాఖ ఉప కమిషనర్ కార్యాలయంలో ఉన్న విఘ్నేశ్వరుని ఆలయంలో చవితి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాలిపేటలోని విఘ్నేశ్వరస్వామి ఆలయంలో గణపతి నవరాత్ర ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చేశామని ఈఓ శివబాబు తెలిపారు.

మార్కెట్‌కు చవితి శోభ

మరోపక్క మార్కెట్‌కు వినాయక చవితి శోభ వచ్చింది. జిల్లాలో ఆదివారం ఏ దుకాణం చూసినా రద్దీగా కనిపించింది. వినాయక వ్రత నిర్వహణకు కావాల్సిన పూజా సామగ్రి, పువ్వులు, పత్రి వంటి వాటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు దుకాణాలకు రావడంతో ఎక్కడ చూసినా సందడే కనిపించింది. దుకాణాల వద్ద ఎగబడి మరీ పూజా సామగ్రి కొనుగోలు చేశారు. పత్రి, పండ్లు కొనుగోలు చేసేందుకు అధిక సంఖ్యలో జనం రావడంతో నగరంలోని భానుగుడి, బాలాజీచెరువు, పెద్ద మార్కెట్ తదిర ప్రాంతాల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ధరలు ఆకాశన్నంటడంతో భక్తులు కాస్త నిరాశ చెందారు. ఉన్నంతలోనే పూజా సామగ్రి కొనుగోలు చేసుకొని ఇంటి ముఖం పట్టారు.

భారీగా గణనాథుల ఏర్పాటు

కాకినాడ నగరంతో పాటు సామర్లకోట, పెద్దాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, పిఠాపురం, కత్తిపూడి, తుని తదితర ప్రాంతాల్లో భారీ గణనాథుల్ని ఏర్పాటు చేస్తున్నారు. నగరంలోని స్థానిక గోకులం, ఎల్‌బీ నగర్, 50 బిల్డింగ్ సెంటర్, భానుగుడి, బాలాజీ చెరువు సెంటర్, మెయిన్ రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో ప్రత్యేకంగా డెకరేషన్ చేసి స్వామి మంటపాలు ఏర్పాటు చేస్తున్నారు. కొంతమంది ఖర్చుకు వెనుకాడకుండా సినిమా సెట్టింగులను తలపించేలా మంటపాలను తీర్చిదిద్దుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి కళాకారులను రప్పించి మరీ, కళ్లు చెదిరేలా సెట్టింగులు తీర్చిదిద్దుతున్నారు. భక్తులను ఆకట్టుకునేలా రంగురంగుల క్లాత్ డెకరేషన్ చేస్తున్నారు. కళ్లు మిరుమిట్లు గొలిపేలా రంగురంగుల విద్యుద్దీపాలు అలంకరిస్తున్నారు. ఇప్పటికే తమ కావాల్సిన భారీ గణనాథుని విగ్రహాలను ప్రత్యేకంగా తయారు చేయించిన ఆలయ, ఉత్సవ కమిటీలు అందుకు అనుగుణంగా మంటపాలను సిద్ధం చేస్తున్నారు.

పెరిగిన పూజా సామగ్రి ధరలు

చవితి సందర్భంగా పండ్ల ధరలను వ్యాపారులు పెంచేశారు. పెద్ద సైజు బత్తాయి, యాపిల్, దానిమ్మ కాయలు డజను రూ.400 నుంచి రూ.500కు విక్రయించారు. చిన్న సైజు కాయలు సైతం రూ.300 వరకూ విక్రయించారు. విడిగా రెండు కాయలు కావాలంటే రూ.50 చెప్పడంతో వీటిని కొనేందుకు సాధారణ, మధ్యతరగతి ప్రజలు జంకాల్సిన పరిస్థితి నెలకొంది. అరటి పండ్ల రేటును కూడా అమాంతం పెంచేశారు. సాధారణ రోజుల్లో డజను అరటి పండ్లు రూ.50 ఉండగా రూ.70కి విక్రయించారు. పూజకు ఉపయోగించే పత్రి ధర కూడా పెరిగింది. చిన్న కట్ట సైతం 20కి విక్రయించారు. పూల ధరలకూ రెక్కలొచ్చాయి. చామంతి 10 పువ్వులు రూ.20కి విక్రయించారు. మొక్కజొన్న పొత్తు ఒక్కొక్కటి రూ.15కు విక్రయించారు.



పూజా సామగ్రి క్రయవిక్రయాలతో కాకినాడ భానుగుడి సెంటర్‌లో సందడి

లడ్డూలకు ఆర్డర్లు

ఇదిలా ఉండగా పలు ఉత్సవ కమిటీల ప్రతినిధులు భారీ గణనాథుని విగ్రహాల చేతిలో పెట్టేందుకు ముందుగానే లడ్డూలకు ఆర్డర్లు ఇస్తున్నారు. వివిధ స్వీటు షాపులను ఈమేరకు సంప్రదిస్తున్నారు. కేజీ నుంచి 100 కేజీల వరకూ ఆర్డర్లు ఇస్తున్నారు. స్వీటు షాపుల యజమానులు కూడా లడ్డూలను చూడగానే ఆకర్షించే రీతిలో ప్రత్యేక అలంకరణతో తయారు చేస్తున్నారు.

మట్టి విగ్రహాలకు ప్రాధాన్యం

పర్యావరణ పరిరక్షణపై చైతన్యం పెరగడంతో ప్రజలు ఈ ఏడాది మట్టి విగ్రహాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. పలుచోట్ల మంటపాల్లో ఏర్పాటు చేసే భారీ విగ్రహాలతో పాటు, ఇంటి వద్ద పూజించే గణనాథుని విగ్రహాలు కూడా మట్టివే వినియోగిస్తున్నారు. రోటరీ, లయన్స్ క్లబ్, ధరిత్రి రక్షణ సమితితో పాటు పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో గణనాథుల విగ్రహాలను ఇప్పటికే ఉచితంగా పంపిణీ చేశారు. లయన్స్ ప్రొఫెషనల్ క్లబ్ ఆధ్వర్యాన నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం 1,500 మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ జోనల్ చైర్మన్ ద్వారంపూడి విపుల్, సభ్యులు నిమ్మకాయల వేంకటేశ్వరరావు, మోహనరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలి



“మంటపాలు ఏర్పాటు చేసేవారు విద్యుత్ కోసం ఆ శాఖ అధికారుల నుంచి, మైక్ ఉపయోగించుకొనేందుకు పోలీసు శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. ఎటువంటి అనుమతులూ లేకుండా రోడ్డుపై మంటపాలు పెట్టకూడదు.

– వడ్డి ఫణీంద్ర, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్, కాకినాడ డివిజన్”



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న లయన్స్ ప్రొఫెషనల్ క్లబ్ సభ్యులు



కాకినాడ ఎల్‌బీ నగర్‌లో చవితి ఉత్సవాలకు ముస్తాబైన వినాయకుడి ఆలయం

న్యూస్‌రీల్

ఉత్సాహంగా జూనియర్స్ అథ్లెటిక్స్ మీట్, ఎంపికలు



అండర్-14 రన్నింగ్ విభాగంలో పోటీ పడుతున్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జూనియర్స్ అథ్లెటిక్స్ మీట్, ఎంపికలను ఆదివారం కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ ఎంపికలను డీఎస్‌ఏ ముఖ్యశిక్షకులు బి.శ్రీనివాస్ కుమార్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) రిటైర్డ్ అథ్లెటిక్స్ కోచ్ కొండలరావు ప్రారంభించారు. ముందుగా అథ్లెటిక్స్ సంఘ అధ్యక్షుడు డాక్టర్ కె.స్వర్ణన్‌రాజు, సీనియర్ క్రీడాకారుడు గౌతమ్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించేవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అథెటిక్స్ సంఘ కార్యదర్శి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 600 మంది ఈ పోటీలకు హాజరయ్యారన్నారు. వీరి నుంచి గుంటూరులో ఈ నెల 21, 22, 23 తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల పోటీలకు సుమారు 100 మందిని ఎంపిక చేస్తామన్నారు. అండర్-14, 16, 18, 20, 23 విభాగాల్లో పోటీలు రన్నింగ్, షాట్‌పుట్, జావలిన్ త్రో, షాట్‌పుట్, లాంగ్ జంప్, హైజంప్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోటీల ఎంపిక కమిటీ చైర్మన్ వై.తాతబ్బాయి, రాష్ట్ర పీఈటీ సంఘ అధ్యక్షుడు జార్జి, రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘ ఉపాధ్యక్షుడు రంగారావు, నిర్వహణ కార్యదర్శి రాజు, పీడీలు వర్మ, బంగార్రాజు, పట్టాభి, కోచ్ ప్రసాద్‌రెడ్డి, స్వర్ణన్‌రాజు సోదరుడు జాన్‌వెస్లీ, సీనియర్ క్రీడాకారుడు గౌతమ్ సోదరుడు సునీల్, పీడీ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



స్పోర్ట్స్ మీట్‌లో మాట్లాడుతున్న సూర్యనారాయణ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లాస్థాయి లయన్స్ క్లబ్ స్పోర్ట్స్ మీట్ కాకినాడ లయన్స్ క్లబ్ ఎలైట్ ఆధ్వర్యాన జిల్లా క్రీడా మైదానంలో ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వేలూరు సూర్యనారాయణ ఈ పోటీలను ప్రారంభించారు. క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగు పడతాయని ఈ సందర్భంగా ఆయనన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్‌ఏ) ముఖ్య శిక్షకుడు బి.శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి రోజూ ఒక గంట ఏదో ఒక ఆట ఆడటం వలన మానసిక, శారీరక ఆరోగ్యం చేకూరుతుందని అన్నారు. స్పోర్ట్స్ మీట్ కో ఆర్డినేటర్ ముంజులూరి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ. జిల్లా వ్యాప్తంగా 32 క్లబ్బుల నుంచి 288 మంది ఈ పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. వాకింగ్, రన్నింగ్, షాట్‌పుట్, లాంగ్‌జంప్, బ్యాడ్మింటన్; టెన్నికాయిట్, జావెలిన్‌త్రో తదితర పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో లయన్ బీవీఎస్ రెడ్డి, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్లు త్రిమూర్తులు, బాదం బాలకృష్ణ, కోడూరి రంగారావు, కృష్ణమూర్తి, వెంకటేశ్వరరావు, మంగతాయారు, పోటీల కమిటీ చైర్మన్ విఠల్, జెడ్సీ శ్రీనివాస్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. తొలుత ముఖ్య అతిథి సూర్యనారాయణ బెలూన్లు వదిలి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. సభ్యులు మార్చ్‌పాస్ట్ నిర్వహించారు.

పుష్కర నుంచి 350 క్యూసెక్కులు

సీతానగరం: తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలం పురుషోత్తపట్నంలోని తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం నుంచి 350 క్యూసెక్కుల గోదావరి జలాలను సాగు అవసరాలకు విడుదల చేశారు. జలవనరుల శాఖ డీఈ వెంకట్రావు ఆదివారం ఈ విషయం తెలిపారు. పుష్కర-1, 2 నుంచి చెరొక మోటారు ద్వారా నీటిని విడుదల చేశామన్నారు. ప్రస్తుతం సాగునీటికి అంతగా డిమాండ్ లేదని తెలిపారు. అవసరమైతే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సాగునీటి విడుదలను పెంచుతామన్నారు. గోదావరి నీటిమట్టం 20.1 మీటర్లు ఉందని వెంకట్రావు తెలిపారు.

బీచ్‌లో 'స్వచ్ఛ సాగర్.. సురక్షిత సాగర్'



స్వచ్ఛ సాగర్ - సురక్షిత సాగర్ ప్రచారంలో మత్స్యశాఖ జేడీ సత్యనారాయణ, శాస్త్రవేత్త శ్రావణి తదితరులు

కాకినాడ రూరల్: అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (ఇన్కాయిస్), హైదరాబాద్‌లోని భారత ప్రభుత్వ ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన స్వచ్ఛ సాగర్ – సురక్షిత సాగర్ కార్యక్రమంపై ప్రచారం నిర్వహించారు. మత్స్యకార సంక్షేమ సమితి సహకారంతో సూర్యారావుపేట బీచ్‌లో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా మత్స్యశాఖ అధికారి సత్యనారాయణ, ఇన్కాయిస్ ప్రాజెక్ట్ సైంటిస్ట్ సీహెచ్ శ్రావణి, కె.రామకృష్ణ, ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి నూకరాజు తదితరులు బీచ్‌లో చెత్త తొలగింపు చేపట్టారు. సముద్రంపై ఆధారపడి జీవనోపాధి పొందే మత్స్యకారులు, బీచ్‌లపై ఆధారపడి జీవనం సాగించే చిరు వ్యాపారులకు పర్యావరణ పరిరక్షణపై శ్రావణి అవగాహన కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా 12 తీర ప్రాంత జిల్లాల్లోని 37 ప్రాంతాల్లో రెండు రోజుల పాటు ఈ అవగాహన కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ, చేపల వేటకు వెళ్లినప్పుడు ప్లాస్టిక్ వ్యర్థాలు, సిగరెట్ పీకలను సముద్రంలో వేయవద్దని మత్స్యకారులకు సూచించారు. దీనివలన మత్స్య సంపద దెబ్బ తినే అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో మెరైన్ పోలీసులు, రిలయన్స్ ఫౌండేషన్, పీఆర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీపాద శ్రీవల్లభ జయంతి

పిఠాపురం: ప్రముఖ దత్త క్షేత్రమైన శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రీపాద శ్రీవల్లభ జయంతి మహోత్సవాలు ఐదు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా స్వామివారికి సహస్ర గులాబీ అర్చన, పల్లకీ సేవ, ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. వందలాదిగా తరలి వచ్చిన మరాఠీ భక్తులు పాల్గొనగా స్వామివారి గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈఓ సౌజన్య ఆధ్వర్యాన వారం రోజుల పాటు జయంత్యుత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తులకు వసతి, భోజనాది సౌకర్యాలను ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ రెడ్డెం జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీపాద శ్రీవల్లభ స్వామి వారికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

ప్యాకేజీ స్టార్‌ను ప్రజలు నమ్మరు



జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): చంద్రబాబు దత్తపుత్రుడు, ప్యాకేజీ స్టార్ పవన్ పవన్ కల్యాణ్‌ను నమ్మే స్థితిలో రాష్ట్ర ప్రజలు లేరని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్ నాయక్ అన్నారు. కాకినాడ జిల్లాలోని గిరిజన గ్రామాల్లో రెండు రోజులు పర్యటించిన ఆయన.. ఆదివారం కాకినాడలోని అతిథి గృహంలో విలేకర్లతో మాట్లాడారు. అవినీతి వల్లే చంద్రబాబుపై కేసు పెట్టారని చెప్పారు. ఆయనకు రిమాండ్ విధిస్తూ తీర్పు ఇచ్చిన న్యాయమూర్తిని సోషల్ మీడియాలో దూషించడం సరికాదని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిపుత్రుల విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, గిరిజనులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, అన్ని విధాలా సహకరిస్తున్నారని చెప్పారు. గిరిజనుల పక్షపాతిగా, తండ్రిని మించిన తనయుడిగా మంచి పాలన అందిస్తున్నారని కొనియాడారు.

ఎస్పీతో భేటీ

కాగా, శంకర్ నాయక్ జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్‌ను ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. గిరిజన ప్రాంతానికి సంబంధించిన అంశాలు, అక్కడి శాంతిభద్రతల పరిస్థితిపై చర్చించారు. అనంతరం పోలీసు శిక్షణ అందిస్తున్న శ్యామ్ ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించి, విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యారు. ఆయన వెంట జిల్లా గిరిజన సంక్షేమ అధికారి విజయశాంతి, జేఎన్‌టీయూకే ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ మాలోతు రమేష్ ఉన్నారు.

లోవలో భక్తుల సందడి

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో లోవ దేవస్థానంలో సందడి నెలకొంది. ఆదివారం ఆరు వేల మందికి పైగా భక్తులు క్యూలైన్ల ద్వారా బాలాలయంలో అమ్మవారిని దర్శించుకున్నట్టు కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాలు, పూజా టికెట్లు, కేశఖండన శాల, వాహన పూజలకు, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలు, విరాళాల రూపేణా రూ.3,31,439 ఆదాయం సమకూరిందని వివరించారు.

పండగ పూట.. తీపికబురు



- విశ్రాంత వ్రత పురోహితులకు సర్వీసును బట్టి ఏడాదికి రూ.10 వేల చొప్పున గ్రాట్యుటీ
- ప్రభుత్వం ఉత్తర్వులు
- 33 మందికి రూ.67.25 లక్షల మేర లబ్ధి
- రేపు పంపిణీ చేయనున్న మంత్రి దాడిశెట్టి రాజా, ఎమ్మెల్యే పర్వత

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో సేవలందించిన 33 మంది విశ్రాంత వ్రత పురోహితులకు వినాయక చవితి పండగ పూట రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. గతంలో ఇద్దరు విశ్రాంత పురోహితులకు చెల్లించినట్టుగానే ఈ 33 మందికి కూడా వారి సర్వీసును అనుసరించి ఏడాదికి రూ.10 వేల చొప్పున గ్రాట్యుటీ చెల్లించాలని ఆదేశించింది. ఈ మేరకు వీరు గరిష్టంగా రూ.4.5 లక్షలు, కనిష్టంగా రూ.1.5 లక్షల వరకూ గ్రాట్యుటీ పొందనున్నారు. వీరికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ చేతుల మీదుగా మంగళవారం గ్రాట్యుటీ చెక్కులు అందించనున్నారు.

గతంలో రూ.లక్షే..

అన్నవరం దేవస్థానంలో ఏటా సుమారు 7 లక్షల వ్రతాలు జరుగుతున్నాయి. వీటి ద్వారా ఏటా రూ.35 కోట్లు పైబడి ఆదాయం వస్తోంది. దేవస్థానంలో స్పెషల్‌గ్రేడ్ పురోహితులు 12 మంది, మొదటి తరగతి పురోహితులు 48 మంది, రెండు, మూడు తరగతుల వారు వంద మంది చొప్పున సేవలందిస్తున్నారు. వ్రతాల ఆదాయంలో వీరికి దేవస్థానం 40 శాతం పారితోషికంగా చెల్లిస్తోంది. వీరికి వరుసగా నెలకు రూ.40 వేలు, రూ.37 వేలు, రూ.35 వేలు, మూడో తరగతి వారికి రూ.25 వేల నుంచి రూ.31 వేల వరకూ చెల్లిస్తున్నారు. వీరు 65 సంవత్సరాల తరువాత పదవీ విరమణ చేస్తారు. గతంలో పురోహితులు ఎన్ని సంవత్సరాలు సేవలందించినా వారికి పదవీ విరమణ అనంతరం రూ.లక్ష మాత్రమే గ్రాట్యుటీ చెల్లించేవారు. వ్రత పురోహితులు ముత్య సత్యనారాయణ, ప్రయాగ వేంకటరమణ గత ఏప్రిల్ నెలాఖరున పదవీ విరమణ చేశారు. తాము సుమారు 40 సంవత్సరాల సర్వీసు పూర్తి చేశామని, తమ సర్వీసు ఆధారంగా గ్రాట్యుటీ చెల్లించాలని ప్రభుత్వానికి వారు అప్పట్లో దరఖాస్తు చేసుకున్నారు. దీంత ఆ ఇద్దరికీ సర్వీసు ఆధారంగా గ్రాట్యుటీ చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు గత జూలైలో వారికి రూ.4.70 లక్షల చొప్పున గ్రాట్యుటీ చెల్లించారు. ఈ ఉత్తర్వులను 2015 నుంచి 2023 వరకూ పదవీ విరమణ చేసిన వ్రత పురోహితులందరికీ కూడా వర్తింపజేయాలని విశ్రాంత పురోహితులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. దీంతో దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఈ మేరకు ఆదేశాలిచ్చారు.

ఇది మాకు ప్రభుత్వ వరం



వృద్ధాప్యంలో వైద్య ఖర్చులకు పెన్షన్ సరిపోక చాలా మంది విశ్రాంత వ్రత పురోహితులు ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో సర్వీసును అనుసరించి గ్రాట్యుటీ చెల్లించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మాకో వరం. పదవీ విరమణ చేసిన 33 మంది విశ్రాంత పురోహితులం చాలా ఆనందిస్తున్నాం.

– నాగాభట్ల కామేశ్వరశర్మ, వ్రతబ్రహ్మ, దేవస్థానం వైదిక సలహాదారు

చాలా సంతోషంగా ఉంది



దేవస్థానంలో 30 ఏళ్లు పైబడి పురోహితునిగా సేవలందించాను. పదవీ విరమణ చేసినపుడు రూ.లక్ష మాత్రమే గ్రాట్యుటీ చెల్లించారు. నాతో పాటు విశ్రాంత పురోహితులందరికీ గ్రాట్యుటీ పెంపు నిర్ణయం చాలా సంతోషాన్నిచ్చింది. పురోహితులకు అన్ని విధాలా మేలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావాలని కోరుకుంటున్నాం.

– కర్రి వైకుంఠం, విశ్రాంత వ్రత పురోహితుడు

సముచిత నిర్ణయం



దేవస్థానంలో విశ్రాంత వ్రత పురోహితులకు గ్రాట్యుటీ పెంచాలనే నిర్ణయం చాలా సముచితం. ఈ పురోహితులకు రాష్ట్ర మంత్రి దాడిశెట్టి రాజా, ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ చేతుల మీదుగా మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు గ్రాట్యుటీ చెక్కులు చెల్లించేందుకు ఏర్పాట్లు చేశాం.

– చంద్రశేఖర్ ఆజాద్, కార్యనిర్వహణాధికారి, అన్నవరం దేవస్థానం

ప్రభుత్వం చాలా మేలు చేసింది




దేవస్థానంలోని 260 మంది వ్రత పురోహితులకు సీఎం జగన్ ప్రభుత్వం చేసినంత మేలు గతంలో ఏ ప్రభుత్వమూ చేయలేదు. కొత్తగా 50 మంది పురోహితుల నియామకంతో పాటు 260 మంది పారితోషికాన్ని 30 నుంచి 40 శాతానికి పెంచిన ఘనత ఆయనకే దక్కుతుంది. తాజాగా సర్వీసును బట్టి గ్రాట్యుటీ అందించాలని ఆదేశించారు. ఇది చేతల ప్రభుత్వమనే విషయాన్ని ఈ నిర్ణయాలు రుజువు చేస్తున్నాయి.

– పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్, ఎమ్మెల్యే, ప్రత్తిపాడు

సిద్ధి వినాయకుని పూజకు సర్వం సిద్ధం

- అయినవిల్లిలో చవితి మహోత్సవాలకు ఏర్పాట్లు
- తొమ్మిది రోజులూ ప్రత్యేక క్రతువులు, సాంస్కృతిక కార్యక్రమాలు

అయినవిల్లి: ప్రసిద్ధి చెందిన అయినవిల్లి విఘ్నేశ్వరాలయం చవితి మహోత్సవాలకు సిద్ధం అయింది. చవితి ఉత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వరస్వామిని దర్శించడానికి దేశవ్యాప్తంగా అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. చవితి సందర్భంగా బత్తాయి, దానిమ్మ, యాపిల్, ద్రాక్ష, మామిడి పండ్ల రసాలతో స్వామివారిని అభిషేకించనున్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు జరిగాయి. స్వామికి ప్రత్యేక అభిషేకాల అనంతరం లక్ష గరిక పూజ, వివిధ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ, హారతులు వంటి విశేష కార్యక్రమాలు ఉంటాయి. తొమ్మిది రోజులు వివిధ అవతారాల్లో స్వామి దర్శనమిస్తారు. చవితి రోజున సుమారు 10 వేల మంది భక్తులు ఈ అభిషేకాలు, పూజల్లో పాల్గొననున్నారు. ఆలయ ప్రాంగణం వెలుపల మంటపంలో మట్టి గణపతిని ప్రతిష్ఠించి తొమ్మిది రోజులు పూజలు నిర్వహిస్తారు. ఇందుకు తగ్గట్టుగా ఆలయ చైర్మన్ గుత్తుల నాగేశ్వరరావు(నాగబాబు), ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు (సతీష్‌రాజు) ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణం చలువ పందిళ్లతోను, విద్యుత్ దీపాలంకరణతో శోభాయమానంగా సిద్ధమైంది. అయినవిల్లి ఎస్సై ఎస్.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు.


చవితికి చలువ పందిళ్లతో ముస్తాబైన అయినవిల్లి సిద్ధివినాయక ఆలయం


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

ప్రత్యేక పూజలు నిర్వహించే వేళలు

చవితి సందర్భంగా స్వామివారి ఆలయాన్ని తెల్లవారు జామున నాలుగు గంటలకు తెరుస్తారు. అయిదు గంటల నుంచి స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం 12 గంటలకు నిత్యగణపతి హోమం, ఒంటి గంటకు స్వామివారికి ప్రత్యేక అలంకరణ, ప్రసాద నివేదన కార్యక్రమాలు ఉంటాయి. మధ్యాహ్నం నాలుగు గంటలకు స్వామివారిని తీరు వీధుల్లో పల్లకీలో ఊరేగిస్తారు. సాయంత్రం ఆరు గంటలకు పంచహారతులు ఇస్తారు.

అన్ని ఏర్పాట్లూ చేశాం

స్వామిని దర్శించడానికి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లూ చేశాం. చవితి సందర్భంగా స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహిస్తాం. తొమ్మిది రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశాం.

– ముదునూరి సత్యనారాయణరాజు (సతీష్‌రాజు), ఈఓ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం, అయినవిల్లి

స్వామికి ప్రత్యేక పూజలు

స్వామివారికి చవితి తొమ్మిది రోజులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఉంటాయి. ఆలయం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకూ ఆలయం తెరచి ఉంటుంది.

– అయినవిల్లి సూర్యనారాయణమూర్తి, ఆలయ ప్రధానార్చకులు

ముస్తాబైన లక్ష్మీగణపతి

బిక్కవోలు: చెవిలో చెబితే కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా భక్తులు విశ్వసించే బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతిస్వామి సన్నిధి చవితి వేడుకలకు సిద్ధమైంది. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆనుకుని ఉన్న ఈ ఆలయం నిత్యం భక్తులతో రద్దీగా ఉంటుంది. 1,100 సంవత్సరాల చరిత్ర కలిగిన ఆలయమిది. ఇక్కడ శ్రీ లక్ష్మీగణపతి స్వామి ఏక శిలా మూర్తిగా దర్శనమిస్తారు. ఈ విగ్రహం తూర్పు చాళుక్యుల కాలం నాటిదని పురావస్తు శాఖ అంచనా వేసింది. అప్పటి రాజులు ప్రత్యేక పూజలు చేసి, స్వామి చెవిలో చెప్పి పనులు ప్రారంభిస్తే అనుకున్నట్లుగా జరిగేవని ప్రతీతి. ఇప్పటికీ అదే సంప్రదాయాన్ని పాటిస్తూ భక్తులు..స్వామి వారి చెవిలో తమ కోర్కెలు చెప్పుకుంటారు. తొమ్మిదో శతాబ్దానికి చెందిన స్వామివారి విగ్రహం కాలక్రమేణా భూస్థాపితమైంది. అనంతరం 19వ శతాబ్దంలో ఈ విగ్రహం పంట పొలాల్లో బహిర్గతమైంది. స్వామివారిని సురక్షిత ప్రాంతానికి తరలించడానికి భక్తులు చేసిన ప్రయత్నం ఫలించకపోవడంతో అక్కడే మందిరం నిర్మించి, పూజలు ప్రారంభించారు.

విస్తృత ఏర్పాట్లు

వినాయక చవితి సందర్భంగా శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో సోమవారం ఉదయం నుంచి గణపతి నవరాత్ర మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ప్రతి రోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యాన ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఆలయ ప్రాంగణాన్ని సుందరంగా అలంకరించారు. ఆదివారం రాత్రి దాటాక సోమవారం తెల్లవారు జామున 1.29 గంటలకు తీర్థపు బిందె సేవతో స్వామివారి చవితి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. సోమవారం ఉదయం 10.46 గంటలకు అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యానారాయణరెడ్డి, ఆదిలక్ష్మీ దంపతులు కలశ స్థాపన చేశారు. ఈ నెల 27న మహాన్నదానంతో ఉత్సవాలు పూర్తవుతాయి. ఈ తొమ్మిది రోజులు స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు

స్వామి వారి ప్రత్యేకతలు

బిక్కవోలు శ్రీ లక్ష్మీగణపతి స్వామి విగ్రహం 10 అడుగుల పొడవు, 6 అడుగుల వెడల్పున ఉంటుంది. భారీ కాయంతో ఉన్న స్వామివారికి తొండం కుడి వైపునకు తిరిగి ఉండడం ఇక్కడి ప్రత్యేకత. నాగాభరణం, నాగ మొలతాడు, నాగ యజ్ఞోపవీతం, బిళ్ళకట్టు పంచెతో సుఖాశీనులైన స్వామివారు భక్తులకు కన్నుల పండువగా దర్శనమిస్తారు.


బిక్కవోలు లక్ష్మీగణపతి స్వామి


చవితి సందర్భంగా ఆలయం వద్ద అలంకరించిన చలువ పందిళ్లు

ఘనంగా నిర్వహిస్తాం



ఈ ఏడాది భక్తులు వాన,ఎండ తెలియకుండా ఆలయం చుట్టు పక్కల రేకుల షెడ్లు ఏర్పాటు చేశాం. గత ఏడాది కంటే ఈ ఏడాది కూడా వినాయక చవితి ఉత్సావాలు ఘనంగా చేయాలని నిర్ణయించాం. భక్తులు ఎటువంటి ఇబ్బంది కలగకుండా భారీ క్యూ లు ఏర్పాటు చేశాం. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు చవితి రోజు మినహా మిగిలిన రోజులలో అన్నదానం ఏర్పాటు చేశాం.

– తమ్మిరెడ్డి నాగశ్రీనివాస్‌రెడ్డి, శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్

క్లుప్తంగా

మోసపోయి... కుమిలిపోయి

వివాహిత ఆత్మహత్య


మృతి చెందిన షేక్ హజీరా

కాకినాడ క్రైం: ఆన్‌లైన్‌లో వ్యాపారం నిమిత్తం పెట్టుబడి పెట్టిన ఓ వివాహిత మనోవేదనకు గురై బలవన్మరణానికి పాల్పడింది. కాకినాడ నరసన్ననగర్‌కు చెందిన షేక్ హజీరా (25)కు నాలుగేళ్ల కిందట ఖాలీషాతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. భర్తకు ఆర్థికంగా చేదోడుగా ఉండాలని హజీరా నిర్ణయించుకుంది. ఈ క్రమంలో ఆమె యూ ట్యూబ్ షార్ట్స్‌లో బిజినెస్ ఆఫర్ అనే ప్రకటనను చూసింది. పెన్‌ల విక్రయంతో భారీగా సంపాదించవచ్చన్నది ఆ యాడ్ సారాంశం. నిజమేనని భావించిన హజీరా రూ.17 వేలు పెట్టుబడి పెట్టింది. నాటి నుంచి ఎన్నాళ్లు ఎదురు చూసినా పెన్‌లు గానీ, అవి కాకపోతే కనీసం పెట్టుబడి అయినా వెనక్కి రాలేదు. తాను మోసపోయానని కుమిలి పోయిన ఆమె భర్తతో జరిగిన విషయాన్ని చెప్పింది. ఈ విషయంపై ఇరువురి మధ్య గొడవలు జరిగేవి. దీంతో మనస్తాపం చెందిన హజీరా ఆదివారం రాత్రి ఇంట్లో చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు ఆమెను జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతి చెందింది.

వారు చోరీ చేశారంటే మొత్తం ఊడ్చేస్తారు

- ఇద్దరు అంతర్ జిల్లాల దొంగల అరెస్ట్
- ఈ ఏడాదిలోనే 32 చోరీలు
- రూ.37 లక్షల సొత్తు స్వాధీనం
- బంగారు నగలు కొనుగోలు చేసిన వ్యక్తి కూడా కూడా...
- జిల్లా ఎస్పీ శ్రీధర్ వెల్లడి


చోరీల వివరాలను తెలుపుతున్న ఎస్పీ శ్రీధర్, డీఎస్పీ రమణ, సీఐ ప్రశాంత్‌కుమార్

అమలాపురం టౌన్: దొంగలు ఇళ్లలోకి చోరీలకు వెళ్లినప్పుడు బంగారు, వెండి వస్తువులు, నగదు మాత్రమే దోచుకోవడం సాధారణం. అయితే ఈ ఇద్దరు దొంగలు మాత్రం టీవీ తదితర గృహోపయోగ వస్తువులను కూడా దోచేస్తారు. ఒక రకంగా చెప్పాలంటే చేతికి ఏది దొరికితే అది కాజేసి ఇంటిని మొత్తం ఊడ్చేయడం వీరి నైజం. జిల్లాలోని పలు పోలీసు స్టేషన్ల పరిధిలో వీరు చోరీలు చేశారు. తూర్పుగోదావరి, కాకినాడ, పశ్చిమ గోదావరి, ఏలూరు, అనకాపల్లి జిల్లాల్లో వీరు ఈ ఏడాదిలోనే మొత్తం 32 చోరీలు చేశారు. చివరకు పి.గన్నవరం మండలంలో చోరీలు చేస్తూ పోలీసులకు చిక్కారు. వీరి నుంచి రూ.37 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు. అమలాపురంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ సుసరాపు శ్రీధర్, కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ, పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్ ఈ దొంగల చోరీల చిట్టాను వివరించారు. కాకినాడ జిల్లా కొత్త గైగోలుపాడు శివారు అంబేడ్కర్ కాలనీకి చెందిన పిల్లి సింహాచలం, కాకినాడ రూరల్ మండలం గొండారిగుంటకు చెందిన ముల్కి మారుతీ శ్రీరామ్ సాయిను అరెస్ట్ చేశారు. వీరితోపాటు వీరు దొంగిలించిన బంగారు నగలను దాయడం, కొనడం వంటి నేరాలకు పాల్పడిన కాకినాడ జిల్లా కిర్లంపూడికి చెందిన వలపుశెట్టి వీరబాబును కూడా అరెస్ట్ చేశారు. వీరిని కొత్తపేట మండలం పలివెల వంతెన సమీపంలో శనివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్పీ శ్రీధర్ తెలిపారు. పిల్లి సింహాచలం మొదట్లో వేరే నేర స్నేహితులతో కలసి చోరీలు చేసేవాడు. ఇటీవల కాలంలో మారుతీ శ్రీసాయి రామ్ కొత్తగా స్నేహితుడు కావడంతో అతనితో కలిసి కొత్తగా చోరీలు చేయడం మొదలు పెట్టాడు.

ఏపీ జిల్లాల్లో ఎన్నెన్ని చోరీలంటే..

ఈ ఇద్దరు దొంగలు ఈ 2023 సంవత్సరంలోనే అయిదు జిల్లాల్లో 32 చోరీలకు పాల్పడినట్లు పి.గన్నవరం పోలీసుల దర్యాప్తులో తేలిందని ఎస్పీ శ్రీధర్ పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 12 చోరీలు, తూర్పుగోదావరి జిల్లాలో 7, కాకినాడ జిల్లాలో 7, పశ్చిమ గోదావరి జిల్లాలో 1, ఏలూరు జిల్లాలో 2, అనకాపల్లి జిల్లాలో 3 చోరీలకు పాల్పడ్డారు.

పదే పదే చోరీలపై సెక్షన్ 75 కింద కేసు నమోదు

శిక్షలు పడుతున్నా పదే పదే అదే నేరాలకు పాల్పడుతున్న వీరిపై నేర తీవ్రతను చూపించే సెక్షన్ 75 ప్రకారం కేసులు నమోదు చేస్తున్నట్లు ఎస్పీ శ్రీధర్ తెలిపారు.

స్వాధీనం చేసుకున్న సొత్తు వివరాలు

వీరి నుంచి 586.695 గ్రాముల బంగారు నగలు, 4 మోటారు సైకిళ్లు, ఒక కెమెరా, ఒక కెమెరా ఫ్లాష్ లైట్, 4 ఎస్ఈడీ పెద్ద టీవీలు, ఒక హోమ్ థియేటర్, ఒక మ్యూజిక్ గిటార్ స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.37 లక్షలు ఉంటుందని ఎస్పీ వివరించారు.

కేసును ఛేదించిన పోలీసులకు అభినందన

ఎన్నో చోరీలతో సంబంధం ఉన్న ఈ అంతర జిల్లాల దొంగల కేసును త్వరిత గతిన ఛేదించడమే కాకుండా అరెస్ట్ చేసి వారి నుంచి పెద్ద ఎత్తున సొత్తును రికవరీ చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ శ్రీధర్ అభినందించారు. కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ, పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్ కుమార్, ఎస్సై శ్రీహరి కోట శాస్త్రి, అమలాపురం క్రైం సీఐ డి.గోవిందరావు, ఎస్సై సంపత్‌కుమార్, ఏఎస్సై అయితాబత్తుల బాలకృష్ణ, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను ఎస్పీ ప్రశంసించారు. ఈ విలేకర్ల సమావేశంలో జిల్లా దిశ డీఎస్పీ సుంకర మురళీ మోహన్ కూడా పాల్గొన్నారు.

స్పర్జన్‌రాజు సేవలు చిరస్మరణీయం


స్పర్జన్‌రాజు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న గోవిందరాజు, శ్రీనివాస్‌కుమార్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా ఒలింపిక్ సంఘ కార్యదర్శి, అథ్లెటిక్స్ సంఘ అధ్యక్షుడు, ఆర్ఎంసీ పీడీ దివంగత డాక్టర్ కె.స్పర్జన్‌రాజు క్రీడా రంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా ఒలింపిక్ సంఘ చైర్మన్ చంద్రుగోవిందరాజు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా క్రీడామైదానంలో ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ కె.స్పర్జన్‌రాజు సంతాప సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నన్నయ్య యూనివర్సిటీ ప్రొఫెసర్, ఒలింపిక్ సంఘ సంయుక్త కార్యదర్శి డాక్టర్ జి.ఎలీషా బాబు అధ్యక్షత వహించారు. ముందుగా స్పర్జన్‌రాజు చిత్రపటానికి పూలమాల వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. డీఎస్ఏ చీఫ్‌కోచ్ బి.శ్రీనివాస్‌కుమార్, రాష్ట్ర పీఈటీ సంఘ అధ్యక్షుడు లంకా జార్జి, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు రవిరాజు, స్పర్జన్‌రాజు సోదరుడు జాన్‌వెస్లీ, ప్రతిభా విద్యానికేతన్ అధినేత ప్రకాష్ తదితరులు స్పర్జన్‌రాజు క్రీడారంగానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ పీడీ కృష్ణమూర్తి, ఒలింపిక్ సంఘ కోశాధికారి కొండలరావు, పీడీ కౌర్, తైక్వాండో సంఘ కార్యదర్శి బి.అర్జునరావు, పీడీ విఠల్, క్రీడాకారులు, సంఘ సభ్యులు, డీఎస్ఏ కోచ్‌లు పాల్గొన్నారు.

జల్సారాయుళ్ల అరెస్టు

- చెడు వ్యసనాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడిన గ్యాంగ్
- ఏడుగురు నిందితులను అరెస్టు చేసిన గొల్లప్రోలు పోలీసులు
- రూ.10 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి

పిఠాపురం: వారంతా విద్యావంతులు సమాజంలో పేరున్న కుటుంబాలకు చెందినవారు చెడు వ్యసనాలకు బానిసలై తమ అవసరాలు తీర్చుకోడానికి చోరీల బాట పట్టారు. చివరకు పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యారు. గొల్లప్రోలు పోలీసు స్టేషన్ పరిధిలో వరుస చోరీలకు పాల్పడిన తొమ్మిది మంది గ్యాంగ్‌లో ఏడుగురిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.10 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. ఈ కేసుకు సంబంధించి గొల్లప్రోలు పోలీసు స్టేషన్లో ఆదివారం కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లప్రోలు పోలీసు స్టేషన్ పరిధిలో ఇటీవల వరుస దొంగతనాలు చోటు చేసుకున్నాయి. వీటిపై కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేయగా కొందరు యువకులు గ్యాంగ్‌గా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిసిందన్నారు. వారిపై నిఘా పెట్టి ఆదివారం అరెస్టు చేయగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన ఎస్.సుబాష్, వి.సుధీర్, వి.దుర్గారావు, కె.గణేష్, ఎం.గణేష్, జి.శేషగిరిరావు, గొల్లప్రోలుకు చెందిన సీహెచ్ పవనేంద్ర కుమార్‌లతో పాటు మరో ఇద్దరు నిందితులు గ్యాంగ్‌గా ఏర్పడి కొన్ని రోజులుగా గొల్లప్రోలు పోలీసు స్టేషన్ పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడ్డారు. తమకు తెలిసిన వారి ఇళ్ల వద్ద రెక్కీ నిర్వహించి వారు ఇల్లు వదిలి బయటకు వెళ్లినప్పుడు చాకచక్యంగా చోరీలకు తెగబడే వారు. దొంగతనాల ద్వారా వచ్చిన సొమ్ముతో ఆన్‌లైన్ గేమ్‌లు ఆడడం, గోవా వంటి ప్రాంతాలకు వెళ్లి ఎంజాయ్ చేయడం వంటివి చేసేవారు. ఇలా గొల్లప్రోలు పోలీసు స్టేషన్ పరిధిలో తొమ్మిది దొంగతనాలకు పాల్పడ్డారు. వీరు ఇంటి తాళాలను పగులగొట్టడంతో పాటు ఇంట్లో ప్రవేశించి ఇంట్లో ఉన్న బీరువాలు పగులగొట్టి వాటిలో ఉన్న డబ్బు, బంగారు వస్తువులను దొంగిలించేవారు. పట్టుబడిన వారిలో దొంగ సొత్తును కొనుగోలు చేసిన వారు ఉన్నారని ఆయన తెలిపారు. పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో గొల్లప్రోలు ఎస్సై వినయ్ ప్రతాప్, క్రైం స్టాఫ్ శ్రీనివాస్, పవన్, విష్ణు ఈ కేసును ఛేదించినట్లు ఆయన తెలిపారు. వారిని అభినందించారు.